ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

మంగళవారం 11 జూన్ 2024

# పైసల్ రాక పరేషాన్!

## మిల్లులో ధాన్యం.. కేసుల్లో యాజమాన్యం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

- డబ్బుల కోసం రైతుల గోస
- రైస్ మిల్లు నుంచి రావాల్సిన మొత్తం రూ.3 కోట్లు పైనే
- సర్కారుకు రూ.14 కోట్లు బకాయి
- చెల్లించకుండా తాత్సారం
- నెలక్రితం రూ.6 కోట్ల బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

ములుగు, జూన్ 10: రైస్ మిల్లు నుంచి రావాల్సిన బకాయిలు అందక రైతులు గోసపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.14కోట్ల మేర బకాయిపడ్డ ములుగులోని ఓ రైస్‌మిల్లు యజమాని రైతులకు సుమారు రూ.3 కోట్ల పైనే చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం మిల్లులోని ధాన్యం, బియ్యం నిల్వలు సీజ్ చేసి ఉండటంతో రైతులు డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. మొండిబకాయిపై సీరియస్ అయిన సర్కారు ఈనెల 30 వరకు గడువు విధించిన నేపథ్యంలో యాజమాన్యం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేక అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. 15 రోజుల్లో డబ్బులు చెల్లిస్తాననే మిల్లు యజమాని హామీతో విరమించారు.

### నిల్వలను సీజ్ చేసిన అధికారులు

జిల్లా కేంద్రంలోని ఓ మిల్లుకు 2019 నుంచి 2023 వరకు వరస సీజన్లలో ప్రభుత్వం సేకరించిన రూ.12కోట్ల విలువైన ధాన్యాన్ని అప్పగించింది. దాన్ని బియ్యంగా ప్రాసెస్ చేసి తిరిగి ప్రభుత్వానికి సరఫరా చేయాల్సి ఉంది. కానీ, ఆ మిల్లు యజమాని బియ్యాన్ని ఇవ్వలేదు. ఈవిషయమై సివిల్‌సప్లయ్ అధికారులు ఆ మిల్లు యాజమాన్యానికి నోటీసులు జారీచేసినా పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో మే 3న సివిల్ సప్లయ్ శాఖ జిల్లా మేనేజర్ బానోతు రాంపతి ఆధ్వర్యంలో అధికారులు మిల్లులో తనిఖీలు జరిపారు. రూ.4కోట్ల 80లక్షల విలువైన ధాన్యం, రూ.కోటి 20లక్షల విలువైన బియ్యాన్ని సీజ్ చేసి పర్యవేక్షణ బాధ్యతను జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌కు అప్పగించారు.

### రైతుల నుంచి భారీగా వడ్ల సేకరణ

రైస్‌మిల్లు యజమానులు ప్రభుత్వ అనుమతి లేకుండా రైతుల నుంచి వడ్లను సేకరించొద్దనే ఆదేశాలున్నప్పటికీ రైస్ మిల్లు యజమాని మరో వాణిజ్య సంస్థను సృష్టించుకొని ములుగు, గణపురం, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాలకు చెందిన రైతుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఆ పేరుతో కనీసం లైసెన్స్ కూడా తీసుకోకపోవడం భవిష్యత్తులో మోసగించే అవకాశం ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ మద్దతు ధరకంటే రూ.300 నుంచి రూ.400 వరకు తక్కువకే కొనుగోలు చేసి వాయిదా పద్ధతిలో చెల్లిస్తూ వచ్చారు. అయితే.. ఆ రైస్ మిల్లు యజమాని ప్రభుత్వానికి భారీగా బకాయి పడటంతో మిల్లులోని స్టాక్‌నంతా అధికారులు సీజ్‌చేశారు. దీంతో రైతులకు చెల్లించాల్సిన రూ.3కోట్ల పైనే నిలిచిపోయాయి. సీజ్ చేసిన విషయాన్ని సాకుగా చూపిస్తూ ఆ మిల్లు యజమాని రైతులను రోజుల తరబడి తిప్పుకుంటున్నాడు. ఇదిలా ఉంటే అధికారులు దాడులు నిర్వహిస్తారని ముందే పసిగట్టిన కోర్టులో కేసు వేసినట్లు సమాచారం. నోటీసులు అందుకున్న సివిల్‌సప్లయ్ అధికారులు జరిగిన మోసాన్ని సాక్ష్యాలె సహా కోర్టుకు సమర్పించినట్లు తెలిసింది. గతంలో తన కుటుంబ సభ్యుల పేరిట ఇదే వ్యక్తి నర్సంపేట ప్రాంతంలో మిల్లులు నడిపి ప్రభుత్వానికి సుమారు రూ.6కోట్ల పైనే బకాయిపడ్డట్లు అధికారులు గుర్తించారు.

### జూన్ 30 వరకు గడువు

రైసు మిల్లు యజమాని రూ.14కోట్ల బకాయిని నగదు లేదా బియ్యం రూపంలో చెల్లించాల్సిందిగా ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు విధించింది. లేనిపక్షంలో మిల్లును జప్తు చేయడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈక్రమంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో సివిల్ సప్లయ్ అధికారులు మిల్లు యజమానితో సోమవారం మాట్లాడారు. మిల్లును తెరుస్తామని హామీ ఇస్తే సివిల్‌సప్లయ్ శాఖపై కోర్టులో తాను వేసిన కేసును వెనక్కి తీసుకుంటానని యజమాని చెప్పగా ఇందుకు అధికారులు ఒప్పుకోలేదు. ముందు రైతులకు సెటిల్ చేయాలని సూచించారు. రూ.14 కోట్ల బకాయిని ఎప్పటిలోగా చెల్లించేది హామీ ఇస్తే ప్రభుత్వ అనుమతి తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో రైతుల్లో టెన్షన్ మొదలైంది. మిల్లు యజమాని ప్రభుత్వానికి బకాయి చెల్లించకుంటే మా పరిస్థితి ఏమిటని..? వేదన చెందుతున్నారు.



రైస్‌మిల్లు ఎదుట రైతులు



రైస్‌మిల్లులోని బియ్యం, ధాన్యాన్ని సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్)

# ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

**ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి**



కలెక్టర్ ఇలా త్రిపాఠికి సమస్యలు వివరిస్తున్న ఫిర్యాదుదారులు

ములుగు కలెక్టరేట్, జూన్ 10: ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్‌లో ఆమె వినతులు స్వీకరించారు. మొత్తం 55 వినతులు రాగా వాటిపై అధికారులతో మాట్లాడారు. ప్రజావినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా జిల్లా అధికారులు, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు వెంటనే మరమ్మతు పనులను ప్రారంభించాలన్నారు. వర్షాల నేపథ్యంలో రెడ్‌జోన్‌లో ఉండే ప్రాంతాలపై అప్రమత్తంగా ఉంటూ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా పశువైద్యాధికారి జె.రవికుమార్, టీజీఎస్పీడీసీఎల్ డీఈ నాగేశ్వర్‌రావు, ఇరిగేషన్ డీఐవో డి.అప్పలనాయుడు, డీఈవో పాణిని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీసీవో సర్దార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి

**భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా**



ప్రజావాణిలో మహిళ సమస్యను వింటున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 10: ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలని అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. మొత్తం 25 వినతులు రాగా వాటిపై అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి వినతులను ప్రాధాన్యక్రమంలో తక్షణమే పరిష్కరించాలన్నారు. వినతులు సమర్పించిన వారికి వాటి స్థితిగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరావు, డీఎంహెచ్‌వో మధుసూదన్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించొద్దు

**భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే**



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 10: వివిధ సమస్యలతో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల పోలీసులు అలసత్వాన్ని ప్రదర్శించొద్దని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్‌లో వివిధ మండలాల నుంచి వచ్చిన 16 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను ఓపిగ్గా తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తుంటారని అన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాసటగా నిలవాలని అన్నారు. బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి భరోసా కల్పించాలని సూచించారు.

# ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలు






ప్రమాదంలో గాయపడిన రాకేష్, విష్ణు

ములుగు, జూన్ 10: ములుగు మండలం ఇంచర్ల సమీపంలో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంకటాపూర్(రామప్ప) మండల కేంద్రం నుంచి సిమెంటు దిమ్మెల లోడుతో ట్రాక్టర్ ములుగు మండలం దేవగిరిపట్నం వైపు వస్తున్న క్రమంలో ఈప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి బోల్తాపడగా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ మేకల అజయ్ స్వల్పంగా గాయపడ్డాడు. కూలీలు నార్లగిరి రాకేష్, మేకల విష్ణుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో పోలీసులు క్షతగాత్రులను ఆటోలో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాకేష్, విష్ణు పరిస్థితి ఆందోళనకరంగా ఉండగా మెరుగైన చికిత్స కోసం వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన ప్రదేశం ములుగు-వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ల సరిహద్దు మధ్యలో ఉండడంతో కేసు ఎవరి పరిధిలోకి వస్తుందో తేలాల్సి ఉంది.

# జేఈఈలో మెరిసిన గిరిజన విద్యార్థి

**ఎస్టీ కేటగిరీలో 368వ ర్యాంకు కైవసం**



సాయి వెంకటకృష్ణ

వాజేడు, జూన్ 10 : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గిరిజన విద్యార్థి ప్రతిభ చాటాడు. ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 368వ ర్యాంక్ సాధించి ఏజెన్సీకి వన్నె తెచ్చాడు. మండలంలోని గుమ్మడిదొడ్డికి చెందిన పాయం సాయి వెంకటకృష్ణ ఆదివారం విడుదలైన జేఈఈ ఫలితాల్లో సత్తా చాటి ఐఐటీకి అర్హత సాధించాడు. సాయి వెంకటకృష్ణ పదో తరగతి వరకు ఖమ్మంలోని నవోదయ పాఠశాలలో చదివాడు. ఇంటర్ విద్యను వరంగల్‌లోని నవోదయలో అభ్యసించాడు. ఏడాది పాటు మహారాష్ట్ర పూణేలో కోచింగ్ తీసుకున్నాడు. వెంకటకృష్ణ తండ్రి పాయం ప్రసాద్ మూడేళ్ల క్రితం కరోనాతో మృతి చెందగా తల్లి శకుంతల పోస్టు మాస్టర్‌గా ఉద్యోగం చేస్తూ కొడుకు, కూతురిని చదివిస్తోంది. సాయిని పలువురు అభినందించారు.

## జాతీయ రహదారిపై రాస్తారోకో

న్యాయం చేయాలని నిరసనకు దిగిన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులు

వివరాలు 8వ పేజీలో...

# టెస్కాబ్ చైర్మన్‌గా మార్నేని

- హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఏకగ్రీవ ఎన్నిక
- నియామకపత్రాన్ని అందుకున్న రవీందర్‌రావు
- గత చైర్మన్ కొండూరు రాజీనామాతో అవకాశం
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధికి తొలిసారి దక్కిన పదవి
- సీఎం, పలువురు మంత్రులను కలిసిన మార్నేని
- రవీందర్‌రావు వర్గీయుల్లో ఆనందం.. వర్ధన్నపేటలో సంబురాలు



సంతకం పెడుతున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 10 : తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నియమితులవగా.. వైస్ చైర్మన్‌గా హైదరాబాద్ డీసీసీ బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్ అబిడ్స్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో సీసీ అండ్ ఆర్‌సీఎస్ కమిషనర్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా ముగిసింది. ఎన్నిక పూర్తయిన తరువాత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ హరిత నుంచి రవీందర్‌రావు నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా చరిత్రలోనే ఇక్కడి డీసీసీ బ్యాంక్ చైర్మన్ టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులు కావడం ఇదే తొలిసారి. మార్నేని ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే రవీందర్‌రావు అనుచరులు, వర్ధన్నపేట నియోజకవర్గంలో సంబురాలు నెలకొన్నాయి.

### కొండూరు రవీందర్‌రావు రాజీనామాతో ఏర్పడిన ఖాళీ

బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వీటిలో ఒకటి టెస్కాబ్ చైర్మన్ పోస్టు. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీ బ్యాంకులున్నాయి. చైర్మన్లుగా ఉన్న వారిలో ఏడుగురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. టెస్కాబ్ చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుతో పాటు వైస్ చైర్మన్‌గా ఉన్న నల్గొండ డీసీసీ బ్యాంక్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడలేదు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతో చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం కాగా.. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆయన స్వచ్ఛందంగా టెస్కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేయగా ఆయనతో పాటు వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కూడా రాజీనామా చేశారు. ఈ క్రమంలో టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులకు ఎన్నిక అనివార్యమైంది. అయితే చైర్మన్ రవీందర్‌రావుపై సోమవారం అవిశ్వాస తీర్మానం జరగాల్సి ఉండగా అంతకు ముందే రవీందర్‌రావు రాజీనామా చేయడంతో సభ్యులు ఈ సమావేశంలో మార్నేని రవీందర్‌రావు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియకు గత చైర్మన్ కొండురు రవీందర్‌రావు, వైఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఇక వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేరితో పాటు మిగిలిన ఆరు చైర్మన్లు హాజరై.. వారంతా మార్నేనికి మద్దతు తెలపడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే అంతకు ముందు పలువురు డీసీసీబీ చైర్మన్లు ఈ చైర్మన్ పదవి కోసం పావులు కదిపారు. కానీ చివరకు మార్నేని రవీందర్‌రావును చైర్మన్ పదవి వరించింది.

### జిల్లాకు తొలిసారిగా దక్కిన రాష్ట్ర చైర్మన్...

వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా గతంలో బాధ్యతలు చేపట్టిన వారిలో ఎవరూ టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులు కాలేదని బ్యాంక్ వర్గాలు చెబుతున్నాయి. మార్నేని చైర్మన్‌గా నియమితులవడంతో జిల్లా నుంచి ఈ చైర్మన్ పదవిని పొందిన తొలి ప్రజాప్రతినిధిగా మార్నేని గుర్తింపు పొందారు. మార్నేని నియామకంతో వర్ధన్నపేట నియోజకవర్గం, ఆయన వర్గీయుల్లో ముఖ్యంగా ఆయన స్వగ్రామం ఐనవోలులో సంబురాలు చోటు చేసుకున్నాయి.

**బయోడేటా :**

**పేరు** : మార్నేని రవీందర్‌రావు, **జన్మస్థలం** : ఐనవోలు (వర్ధన్నపేట)
**విద్యార్హతలు** : బీ.ఏ., **తండ్రి** : మార్నేని మాధవరావు (స్వాతంత్ర్య సమరయోధుడు), **తల్లి** : ప్రమీల, **భార్య** : మధుమతి (ఐనవోలు ఎంపీపీ)
**కూతురు** : రిషిత
**రాజకీయ నేపథ్యం** : 1983 నుంచి టీడీపీలో ఉంటూ అనేక పదవుల నిర్వహణ. 1987లో ఐనవోలు సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు

- 1996 నుంచి 2004 వరకు ఐనవోలే మల్లిఖార్జున దేవస్థానం ఐనవోలు ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వ్యవహరించారు.
- 2006లో వర్ధన్నపేట జడ్పీటీసీగా ఎన్నిక. జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా బాధ్యతల నిర్వహణ. 2009లో బీఆర్ఎస్‌లో చేరిక.
- వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా 2020 ఫిబ్రవరి 29 బాధ్యతలు చేపట్టారు.

# తునికాకు బోనస్ చెల్లించాలని కూలీల ధర్నా




అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కూలీలు, నేతలు

తాడ్వాయి, జూన్ 10: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గి చిరంజీవి ఆధ్వర్యంలో కూలీలు స్థానిక అటవీశాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు.. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 2016 నుంచి 2023 వరకు పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను కూలీలకు చెల్లిస్తామని రాష్ట్ర సీసీఎఫ్ గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు.ఇప్పటి వరకు సగం మంది లబ్ధిదారులకు కూడా బోనస్ అందలేదని అన్నారు. కష్టపడి ఆకు సేకరించినా డబ్బులు జమ కాలేదన్నారు. తునికాకు డబ్బులు కూడా కొంతమందికి జమకాలేదని లబ్ధిదారులు అంటున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తునికాకు బోనస్‌ను చెల్లించాలని, లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఆలెం అశోక్, చింత భాస్కర్, సీఐటీయూ నాయకులు చిట్టినేని శ్రీనివాస్, నర్సింగరావు, లబ్ధిదారులు బచ్చల వెంకటేశ్వర్లు, తాటి వినయ్, కుశన్, మంకిడి సాంబలక్ష్మి, గుండెబోయిన స్వరూప, పెద్దక్క, సూరమ్మ, చిన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దచెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం

## కూలిన రాతి గోడ

## వరద పెరిగితే కట్ట కొట్టుకుపోయే ప్రమాదం



వేలుబెల్లిలో కూలిన పెద్ద చెరువు కట్ట రాతి గోడ

కొత్తగూడ, జూన్ 10 : కాకతీయుల కాలం నాటి పెద్ద చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్టకు రక్షణగా ఉన్న రాతి గోడ కూలిపోయింది. శిథిలావస్థలో చెరువు తూము ఉంది. మండలంలోని వేలుబెల్లి గ్రామంలో నాడు కాకతీయులు పాలించే కాలంలో పెద్ద చెరువు తవ్వించారు. సుమారు 30 సంవత్సరాల క్రితం చెరువు కట్టకు బుంగలు పడి నీరు వృథాగా పోతుండగా రైతులు బుంగలు పూడ్చివేసి కట్టకు రక్షణగా రాతి గోడ నిర్మించారు. కాని, నేడు ఆ రాతి గోడ కూలిపోయింది. వర్షాలకు వచ్చిన వరద నీరుతో చెరువు నిండితే కట్టకు బుంగలు పడే ప్రమాదం ఉందని, బుంగలు పడితే చెరువు కట్ట కొట్టుకుపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్ట తెగితే నీరు వృథాగా పోయి పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. చెరువుకు ఉన్న తూము సైతం శిథిలావస్థకు చేరుకుందని, కాలువలు పూడుకు పోయాయని రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చెరువు కట్టకు, తూములకు మరమ్మత్తు పనులు చేపట్టాలని సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, రైతులు కోరుతున్నారు. పెద్ద చెరువుకు ప్రమాదం పొంచి ఉందని గత సవంత్సరం మే నెలలో 'పెద్ద చెరువుకు పెద్ద గండం' అనే కథనంను ప్రచురించాము. అయిన నాటి నుంచి నేటి వరకు చెరువు కట్టకు, తూముకు మరమ్మత్తులు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట కొట్టుకుపోయిన తర్వాతే అధికారులు స్పందిస్తారేమోనని రైతులు విమర్శిస్తున్నారు.

# జూలై 1 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 : కేయూ పరిధిలో పీజీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు జూలై 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 1 నుంచి 12 వరకు కొనసాగునున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలపై చర్యలు చేపట్టాలి

**టెలీకాన్ఫరెన్స్‌లో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి**

హనుమకొండ టౌన్, జూన్ 10 : విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్ర స్థాయిలో భద్రత చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరు ణ్‌రెడ్డి అన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల 16 సర్కిళ్ల టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లతో సోమవారం సీఎండీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. తరుచుగా జరిగే విద్యుత్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని, భద్రతపై నిర్ల క్ష్యం, అవగాహన లోపంతో నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగంతో వినియోగదారులు తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రమాదాల నివారణకు సర్కిళ్ల వారీగా టెక్నికల్ డివిజన్ ఇంజనీర్లు నోడల్ సేఫ్టీ అధికా రులుగా వ్యవహరించి వినియోగదారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు, రైతులకు, టీజీ ఎన్పీడీసీఎల్ సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకో వాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు కిందిస్థాయి సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు అందరి కృషి అవసరమన్నారు. ఎన్పీడీసీఎల్‌ను జీరో విద్యుత్ ప్రమాదాల సంస్థ తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని, అందుకు ప్రతీ ఒక్క సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలన్నారు.

# గన్నీబ్యాగుల ధర రూ.60కు పెంచాలి

**మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌కు రైతు సంఘం వినతి**



మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతి ప్రతం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్‌రావు

వరంగల్ వ్యవసాయం, జూన్ 10: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రైతుల గన్నీబ్యాగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.30 నుంచి రూ.60లకు పెంచాలని తెలం గాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు సోమవారం హైదరాబా ద్‌లో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. చందర్‌రావు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏడేళ్లుగా గన్నీబ్యాగుల ధరలు పెంచలే దని, ప్రస్తుతం చెల్లించే రూ.30 సైతం నిబంధనల మేరకు వ్యాపారులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. రైతులకు వ్యాపారులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు అదే రైతులు చెల్లించే దడువాయి, హమాలీ, గుల్లవాల, చాటవాల చార్జీ లను మాత్రం క్రమం తప్పకుండా రెండేళ్లకు ఒకసారి పెంచుతూ పోతున్నారని వివ రించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కూస సంపత్‌కుమార్, బల్లు కురి నర్సయ్య పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మహిళ మృతి



నెక్రొండ సెంటర్, జూన్ 10 : మహబూ బాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తుతె లియని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఇన్‌చార్జ్ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో కిలోమీటరు రాయి 435/13 వద్ద సుమారు 45ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేష న్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామ న్నారు. ఆమె మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు.



# విత్తన ఎంపికే కీలకం



షాపుల్లో సిద్ధంగా ఉంచిన పురుగు మందులు

- ప్రకటనలు చూసి మోసపోవద్దు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- నాణ్యమైన విత్తనాలనే కొనాలి
- రశీదులు భద్రపరుచుకోవాలి
- నేల స్వభావం మేరకు ఎరువులు వాడాలి
- సూచిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బచ్చన్నపేట/నర్మెట, జూన్ 10: రైతులు వానాకాలం సాగును ప్రారం భించారు. రోహిణి కార్తెలో కొంత మంది నార్లు పోయగా, మరికొంత మం ది వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా వరితో పాటు పత్తి, మొక్కజొన్న, కంది పంటలు పెద్ద ఎత్తున సాగు చేసే అవకాశం ఉంది. వర్షాలు సైతం అనుకూలంగా కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తు సంకేతాలు ఇస్తుండటంతో సాగుకు అనుకూలంగా ఉన్న భూములను వదిలి పెట్టకూడదని రైతులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో విత్తన, పురుగు మందుల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి విస్తృత ప్రచారం చేస్తూ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామాల్లో టెంట్లు వేసి రైతులను సమీకరించి భోజనాలు ఏర్పాటు చేసి మరీ ప్రచారం చేస్తున్నాయి. తమ కంపెనీ విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని, పంటచేనుకు ఎలాంటి తెగుళ్లు రావని ఊదరగొడుతున్నాయి. అధికారులు ఎంత తనిఖీలు చేసినా మార్కెట్లోకి నకిలీ విత్తనాలు, పురుగు మందులు వస్తూనే ఉన్నాయి. అయితే పంట దిగుబడి అధికంగా రావాలంటే నాణ్యమైన విత్తనాలు అవసరం. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా లేకపోతే శ్రమ, పెట్టుబడి కోల్పోక తప్పదు.

**పురుగు మందుల కొనుగోళ్లలో జాగ్రత్తలు..**

పురుగు మందుల మోతాదు ఎక్కువైతే నష్టపోయేది రైతే. వ్యవశాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని వాడాలని అధికారులు సూచిస్తున్నారు. పురుగు మందు డబ్బాలపై వాటి స్థాయిని తెలిపే విధంగా డైమాండ్ ఆకారంలో ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులు ముద్రించి ఉంటాయి. వాటి గురించి సమగ్రంగా తెలుసుకుని వాడటం మంచిదని అంటున్నారు. వివిధ రకాల పురుగు మందుల డబ్బాల్లో మందు మిగిలితే అన్నింటిని కలిపి కొట్టడం ప్రమాదకరం. ఇలా చేసి అనేక మంది తమ పంటలను కోల్పోయిన వారు ఉన్నారు. కొనుగోలు చేసే సమయంలో రశీదు తీసుకోవటంతో పాటు, డీలర్ రిజిస్టర్ బుక్‌లో సంతకం చేస్తే, నకిలీ పురుగుమందుల వల్ల నష్టపోతే ప్రశ్నించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎరువుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలే తీసుకోవాలని, ఆధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేసి బిల్లులు భద్రపర్చాలని సూచిస్తున్నారు.

**విత్తన కొనుగోళ్లపై నిర్లక్ష్యం తగదు..**

నాసిరకం విత్తనాలు వాడితే విరివిగా తెగుళ్ల సోకుతాయని, పంట దిగుబడి తక్కువగా వస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలంటున్నారు. విడి విత్తనాల జోలికి వెళ్లవద్దంటున్నారు. తీసుకునే బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబరు, రకం పేరు, బ్యాచ్ నంబరు గడువు తేదీలు పరిశీలించి తీసుకోవాలంటున్నారు.

**నేల స్వభావాన్ని బట్టి ఎరువులు వాడాలి..**

నేల స్వభావాన్ని బట్టి పంట ఎదుగుదల, చీడపీడల ఉధృతి ఉంటుంది. అందువల్ల భూమి పోషక విలువలను బట్టి ఎరువులు, పురుగు మందులు వాడడం ఉత్తమం. ఒకరిని చూసి మరొకరు ఒకే రకం పంటలు, విత్తనాలు వేయకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు వాడడం మంచిదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.



నారు పోయడానికి సిద్ధం చేసిన పొలం



డ్రిప్ ఆధారంగా సాగు చేసిన పత్తి

**వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి...**

**- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి**



విత్తనాల కొనుగోలులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దు. నకిలీ విత్తనాలు అని అనుమానం వస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలి. సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేయాలి. మార్కెట్‌లోకి నకిలి విత్తనాలు, పురుగు మందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై రైతులకు అనుమానం వస్తే వెంటనే ఏఈవోలకు, ఏవోకు, అవసరమైతే నాకు సమాచారం అందించాలి. రైతాంగానికి అన్యాయం జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తాం.

# చేతన ఫౌండేషన్‌కు 'ఆటా' అవార్డు




అమెరికాలోని అట్లాంటా నగరంలో అవార్డు అందుకుంటున్న వెనిగళ్ల రవికుమార్

**భారత్ సహా పలు దేశాల్లో సేవా కార్యక్రమాలు**

బయ్యారం, జూన్ 10 : భారత్, అమెరికా సహా ఏడు దేశాల్లో వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు విశ్వనగరం వేదికగా అరుదైన అవార్డు లభించింది. అమెరికాలోని అట్లాంటా నగరంలో చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఆటా) అవార్డు లభించడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. బయ్యారం మండలం గంధం పల్లి గ్రామానికి చెందిన వెనిగళ్ల జగ్గాప్రసాద్‌రావు-సీతామహాలక్ష్మి దంపతుల కుమారుడు రవికుమార్ ఉన్నత విద్యనభ్యసించి అమెరి కాలో స్థిరపడ్డాడు. 2016లో రవికుమార్ భార్య రేణుకతో పాటు పలు వురు ఎన్ఆర్ఐల సహకారంతో చేతన గ్లోబల్ ఫౌండేషన్ స్థాపించి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అంచెలంచెలుగా ఎదు గుతూ భారత్, అమెరికాతో సహ 7 దేశాల్లో చేతన గ్లోబల్ ఫౌండేష న్ ద్వారా నిర్వాహకులు సేవా కార్యక్రమాలను విస్తరించారు. పేద ప్రజలు, విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులకు తమవంతుగా సహా యపడేందుకు నిర్వాహకులు ఈ 8ఏళ్ల కాలంలో కోట్ల రూపాయలు వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఈ క్రమంలోనే చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు నిర్విరా మంగా 7 దేశాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన ఆట సంస్థ అవార్డుతో సత్కరించింది. అమెరికాలోని అట్లాంటా నగ రంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మకమైన 18వ ఆట (అమెరికా తెలుగు అసోసియేషన్) మహాసభల సందర్భంగా ఆదివారం ఆట అధ్యక్షుడు బొమ్మినేని మధు చేతుల మీదుగా చేతన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థా పకులు వెనిగళ్ల రవికుమార్ ఆట అవార్డు అందుకున్నారు. కాగా, విద్య వైద్యం, మహిళా సాధికారిక, పర్యావరణంతో పాటు వివిధ రంగాల్లో తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ గుర్తింపుతో తమపై బాధ్యత మరింత పెరిగింద న్నారు. ముమ్ముందు మరిన్ని సేవా కార్యాక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా పుట్టిన గడ్డ రుణం కొంతైనా తీర్చుకునే భాగ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అంతేకాక చేతన గ్లోబల్ ఫౌండేషన్‌లో అంకితభావంతో పనిచేస్తూ తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి ఈ అవార్డు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రోటవేటర్లో పడి బాలుడి మృతి

**తండ్రి దుక్కి దున్నుతుడగా సరదగా ట్రాక్టర్ ఇంజన్ ఎక్కిన బాలుడు**

**జారి పడటంతో ముక్కలైన శరీర భాగాలు**

**వరంగల్ జిల్లా లైన్‌తండాలో విషాదం**



గుగులోతు బాలు (ఫైల్)



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నల్లబెల్లి, జూన్ 10 : ట్రాక్టర్ రోటవేట ర్‌తో తండ్రి దుక్కి దున్నుతుండగా.. సర దాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి ఎక్కిన కుమా రుడు ప్రమాదవశాత్తు రోటవేటర్లో పడి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లైన్‌తండాలో సోమ వారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... లైన్‌తండాకు చెందిన గుగులోతు మశోద, రాజులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సోమ వారం రాజు ట్రాక్టర్ ఇంజన్‌కు రోటవేట ర్‌ను తగిలించుకొని తన భూమిలో దుక్కి దున్నుతున్నాడు. మధ్యాహ్నం చిన్న కుమారుడు గుగులోతు బాలు(9) రాగా, సరదాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి బాలు ఎక్కాడు. దుక్కి దున్నతున్న సమయంలో ట్రాక్టర్ కుదుపులకు బాలు రోటవేటర్లో పడిపోయాడు. వెంటనే ట్రాక్టర్‌ను ఆపినా, అప్పటికే శరీరం రెండు ముక్క లైంది. ఘటన స్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిం చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బాలుడి తల్లి మశోద ఫిర్యాదు మేరకు ఎస్సై రామారావు కేసు నమోదు చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 :కేయూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి కేయూ పరిపాలన భవనాన్ని ముట్ట డించారు. పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ... విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపిం చా రు. సమస్యలపై విన్నివించినా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్జిగ, పాలు, టీ సరిగా ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులు మెస్ బిల్లులు నెలనెలా కడుతున్నప్పటికీ అధికారులు నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమవుతున్నారన్నారు. వర్సిటీకి పూర్తి స్థాయి వీసీని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థులు శ్రీనాథ్, పృథ్వి, ప్రవళిక, అనూష, శిరీష, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కేయూ పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

# 'ఆయుర్వేదం'లో టెలిమెడిసిన్ సేవలు


**వరంగల్‌లోని ప్రభుత్వ బోధనాసుపత్రి నుంచి అందుబాటులోకి**

**0870-2933553కు కాల్ చేస్తే వైద్య సలహాలు**

**ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు**




ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి



టెలిమెడిసిన్ కేంద్రంలో రోగికి ఫోన్‌లో వైద్య చికిత్స సలహాలు ఇస్తున్న వైద్యుడు

గిర్మాజీపేట, జూన్ 10 : రోగుల సౌలభ్యం కోసం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఇటీవల టెలిమెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పక్ష వాతం, అర్షమొలలు, వెరికోస్ వెయిన్స్, మోకాలు నొప్పులు, దీర్ఘకాలిక, మొండి రోగాలకు వైద్య చికిత్స అందిస్తోంది. మెరుగైన సేవలు అందుతుండడంతో రోగులు సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. కరోనా సమయంలో ఆస్పత్రులకు రాలేని రోగులకు ఫోన్ ద్వారా వైద్య సలహాలు అందించారు. ఇదే తర హాలు ఇకనుంచి నిత్యం ఫోన్‌లోనే సలహాలు, సూచ నలు అందించేందుకు ఇటీవల ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తెచ్చింది.

**ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు..**

ఆస్పత్రిలో టెలిమెడిసిన్ కోసం ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం, సెలవు రోజులు మినహా ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెలిమెడిసిన్ అందుబాటులో ఉంటుంది ఆయుర్వేద వైద్య విభాగాలైన శల్య, శాలక్య, ప్రసూతి, స్త్రీరోగ, స్వస్థవృత్య, పంచకర్మ, కాయ చికిత్స లలో నిష్ణాతులైన వైద్యులు, వైద్య అధ్యాపకులు ప్రతి రోజు రోగులకు అందుబాటులో ఉంటూ టెలిమెడిసిన్ ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగి 0870- 2933553 టెలిమెడిసిన్ సెంటర్‌కు కాల్ చేయ గానే ఆ రోజు సెంటర్‌లో డ్యూటీలో ఉన్న వైద్యుడు రిజిస్టర్‌లో రోగి పేరు, ఫోన్ నెంబర్ నమోదు చేసుకుని రోగికి వైద్య చికిత్స సలహాలు ఇస్తారు. అందుబాటులో ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరి ఉంటే అక్కడికి వెళ్లి ఉచితంగా మందులు తీసుకునే వెసులుబాటు కల్పి స్తారు. లేనిపక్షంలో ప్రయివేట్‌గా కొనుగోలు చేసుకో వచ్చు.

**అన్ని రోగాలకూ సేవలు..**

గ్యాస్ట్రిక్ ట్రబుల్, కీళ్ల నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్, సైనసైటీస్, అర్షమొలలు, దీర్ఘకాళీక నడుము నొప్పు లతో పాటుగా ఇన్‌ఫర్టిలిటీ, నిద్రలేమి సమస్యలపై టెలి మెడిసిన్‌కు కాల్ వస్తున్నాయని వైద్యులు చెబుతు న్నారు. సకాలంలో ఆహారం తీసుకోకపోవడం, వృత్తి, కుటుంబపరమైన మానసిక ఒత్తిడి, మారిన జీవన శైలి, రోజువారి శారీరక వ్యాయామం లేకపోవడం, ఫాస్ట్‌ఫుడ్స్ బ్రేవరేజ్ ఐటెమ్స్ తీసుకుంటున్న కారణాల తోనే అనారోగ్యా సమస్యలకు గురవుతున్నట్లుగా రోగుల కాల్స్‌తో తెలుస్తోందని వైద్యులు చెబుతున్నారు. వరం గల్ మహానగరంతో పాటుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం 10 నుంచి 20 కాల్ వస్తున్నాయని పేర్కొంటున్నారు.

**నిష్ణాతులైన వైద్యులు..**

వరంగల్ రైల్వే, ఆర్టీసీట బస్‌స్టేషన్‌లకు సమీపంలో ఉన్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి నిత్యం 300 మంది అవుట్‌పేషంట్, వంద మంది ఇన్ పేషంట్‌లతో వైద్య సేవలు అందిస్తోంది. పక్షవాతం, కీళ్లనొప్పులు, మోకాలు నొప్పులు, వెరికొస్ వెయిన్స్, అర్ష మొలలు, ఫిస్టిలా, వెన్నునొప్పులు, చెవి, ముక్కు, కన్ను, మధుమేహం, రక్తపోటు, స్త్రీ సంబంధిత, శిశు సంబం ధిత రోగాలకు నిష్ణాతులైన వైద్యులు ఉచితంగా మెరు గైన వైద్య చికిత్సలు చేస్తుండటంతో ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తున్నారు.

**టెలిమెడిసిన్‌ను వినియోగించుకోవాలి**

**డాక్టర్ పద్మావతి, సూపరింటెండెంట్**



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్ప త్రికి రాలేని రోగుల కోసం టెలిమెడిసిన్ సేవలు అంది స్తున్నాం. రోగి అనారోగ్య పరి స్థితిని 0870-2933553 కాల్ చేసి చెబితే వైద్యులు అవసర మైన సలహాలు, సూచనలు అందిస్తారు. సమీప ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్స రీకి రిఫర్ చేస్తూ ఉచితంగా మందులు ఇప్పి స్తున్నాం. ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించాల్సిన పరిస్థితి ఉంటే వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రావాల్సిందిగా సూచిస్తున్నాం. ఈ అవ కాశాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలు సద్విని యోగం చేసుకోవాలి.

# వెలవెలబోతున్న మల్లూరు మధ్యతరహా ప్రాజెక్టు


నీరులేక బోసిపోయిన మల్లూరు మధ్య తరహా ప్రాజెక్టు

మంగపేట, జూన్ 10: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సాగునీటి పథకాల్లో ఒకటైన మల్లూరు మధ్యతరహా ప్రాజెక్టు వెలవెలబోతోంది. మంగపేట మండలంలోని నర్సింహసాగార్ శివారులో ఉన్న ఈ ప్రాజెక్టు మునుపెన్నడూ ఈ వేసవి చివర పూర్తిగా ఎండిపోయింది. గత ఏడాది వేసవిలో రెండు మీటర్ల మేర లోతులో నీరు ఉండేది. ఈసారి పూర్తిగా ఎండిపోయింది. దీంతో ప్రాజెక్టు బోసిపోయి కన్పిస్తోంది. దీని సామర్థ్యం 10.5 అడుగులు. ఇది పూర్తిగా నిండితే మత్తడి పోస్తుంది. ఈ ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాల్వలు ఉన్నాయి. కుడి కాల్వ కింద 3,700 ఎకరాలు, ఎడమ కాల్వ కింద 3,800 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే.. రెండు కాల్వ కింద ఖరీఫ్‌లో సుమారు 9 వేల ఎకరాలు సాగవుతున్నాయి. అలాగే రబీలో 6 వేల ఎకరాలు సాగులో ఉంటాయి. ఈసారి మండుతున్న ఎండలకు తోడు అడుగంటిన జలాలతో ప్రాజెక్టు పూర్తిగా ఎండిపోయింది. ప్రస్తుతం అర అడుగు నీళ్లు కూడా ఇందులో నిల్వలేవు. ప్రాజెక్టులో నీళ్ల లేకపోవడంతో వన్య ప్రాణులు, గ్రామాల్లో మూగజీవాలకు, పశు పక్షాదులకు నీరు లభ్యం కావడం లేదు.

## కేటీకే-1వ గనిని తనిఖీ చేసిన సింగరేణి జీఎం


కార్మికులతో మాట్లాడుతున్న జీఎం హబీబ్ హుస్సేన్

కాకతీయఖని, జూన్ 10: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1వ గనిని ఎ ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ సోమవారం తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో కార్మికులకు అందించే అల్పాహారం, టీని పరిశీలించారు. అనంతరం డిస్ట్రిబ్యూషన్ షెడ్ వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. గని వద్ద గానీ, కార్మికులు నివాసముంటున్న కాలనీల్లో గానీ ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే సంక్షేమ అధికారి కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజశేఖర్, జీఎల్ ప్రసాద్, వెంకట్‌రావు, పాండే, సాధన్ తదితరులు పాల్గొన్నారు.

## దూద్‌పల్లిలో చోరీ


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న సామాన్లు

చిట్యాల, జూన్ 10: ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని దూద్‌పల్లిలో వెలుగు చూసింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుందూరు అమరేందర్‌రెడ్డి టేకుమట్ల మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 8న ఆయన భార్య అఖిలాదేవితో కలిసి హనుమకొండ జిల్లా కావరెడ్డిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మర్నాడు అక్కడి నుంచే భూపాలపల్లిలోని డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 పరీక్ష విధుల్లో పాల్గొన్నారు. మళ్లీ హనుమకొండకు వెళ్లి రాత్రి అక్కడే ఉన్నారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి చేరుకోగా తాళం పగులకొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. గ్యాస్ పొయ్యిపై కోడిగుడ్లు ఉడకపెట్టుకొని తిన్న ఆనవాలు కనిపించాయి. ఇంట్లో ఉన్న తులం బంగారం, 18 తులాల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గుర్తించిన అమరేందర్‌రెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# జాతీయ రహదారిపై రాస్తారోకో

### న్యాయం చేయాలని రోడ్డు ప్రమాద మృతుల కుటుంబ సభ్యుల నిరసన


జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న మృతుల కుటుంబ సభ్యులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 10: భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రేగళ్ల నరేష్, రేగళ్ల ప్రమోద్ కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థులతో కలిసి వంద పడకల ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకొని తమకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఆ వ్యక్తికి వెన్నుదున్నగా నిలుస్తున్నారని ఆరోపించారు. ట్రాఫిక్ భారీగా జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో భూపాలపల్లి ఇన్‌చార్జి సీఐ మల్లేష్ యాదవ్ జోక్యం చేసుకొని బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. ఈ క్రమంలో ఆయనకు, బాధిత కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. బాధిత కుటుంబానికి న్యాయం చేకూరి పరిహారం అందేలా కృషి చేస్తానని సీఐ హామీ ఇచ్చారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు శాంతించారు. ఇదిలా ఉండగా ఇద్దరు మృతుల కుటుంబాలకు మొత్తం రూ.8 లక్షలతోపాటు గాయపడిన సిద్ధుకు వైద్య చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు ఇచ్చేందుకు ప్రమాదానికి కారకుడైన వ్యక్తి అంగీకరించినట్లు తెలిసింది. ఈ నిరసన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా సీఐ మల్లేష్‌యాదవ్‌తో పాటు ఎస్సైలు సుధాకర్, సాంబమూర్తి, సంధ్యారాణి సహా సివిల్, స్పెషల్‌పార్టీ పోలీసులు పటిష్ఠ చర్య చేపట్టారు. బాధితులకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు.

**మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి**

**- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, ఇన్‌చార్జి సీఐ మల్లేష్ యాదవ్‌తో మాట్లాడారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. మూడు కుటుంబాలకు న్యాయం చేసి అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు జడ్పీ సమావేశం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 10: జయశంకర్ భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయంలో జడ్పీ సర్వ సభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు సీఈవో విజయలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు, కలెక్టర్ భవేష్‌మిశ్రా పాల్గొంటారన్నారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రేపు గొర్లవీడు సంతకు బహిరంగ వేలం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 10: భూపాలపల్లి మండల పరిధిలోని గొర్లవీడులోని సంతకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు గొర్లవీడు గ్రామ పంచాయతీ పేరిట రూ.35వేల డీడీ తీయాలని పేర్కొన్నారు.

## గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

**ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా**


గిరిజనుల సమస్యలు వింటున్న పీవో

ఏటూరునాగారం రూరల్, జూన్ 10: ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సెక్టోరియల్ అధికారులను ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమ వారం జరిగిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల వద్ద నుంచి ఆమె వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 68 మంది తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలలుగా గిరిజన దర్బార్ కొనసాగలేదు. తిరిగి సోమవారం నిర్వహించడంతో గిరిజనులు భారీ ఎత్తున తరలివచ్చి పీవోకు వినతులు సమర్పించారు. పలు మండలాల్లోని గిరిజనులు బోర్లు, విద్యుత్తు సౌకర్యం, గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలు, పోడుభూములకు పట్టాలు, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు, పెండింగ్ బిల్లులు తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా గిరిజనులకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో. డీడీ పోచం, ఏవో దామోదరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా సర్వేను పూర్తిచేయాలి

**భూపాలపల్లి కలెక్టర్ భవేష్‌మిశ్రా**


సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

గణపురం, జూన్ 10: తాగునీటి సరఫరా ప్రక్రియలో భాగంగా పక్కాగా ఇంటింటి సర్వే త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. మండలంలోని కర్కపల్లి గ్రామపంచాయతీలో మంచినీటి సరఫరా ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇంటింటికీ మంచినీటి సర్వే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. రానున్న 10రోజుల్లో దీన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో సమస్యలు, లోపాలను క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలని తెలిపారు. జిల్లాలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు 97,791 నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని 241 గ్రామపంచాయతీలు, భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఈ సర్వేను చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట డీఆర్‌డీవో నరేష్, ఎంపీడీవో భాస్కర్ ఉన్నారు.

**నల్లా కనెక్షన్లపై సర్వే**

కాటారం : మండలవ్యాప్తంగా 24 గ్రామపంచాయతీల పరిధిలో మిషన్ భగీరథ కార్యక్రమంలో చేపట్టిన నల్లా కనెక్షన్లపై సోమవారం సర్వే నిర్వహించారు. ప్రతి జీపీ పరిధిలో ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల సిబ్బంది సర్వే చేపట్టారు. ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి.. అవి పని చేస్తున్నాయా..?అనే అంశాలు తెలుసుకుని ఇంటి యజమానుల ఫొటో తీసి యాప్‌లో నమోదు చేశారు. సర్వేను ఎంపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య పర్యవేక్షించారు.

## పేద విద్యార్థినికి సీతక్క తనయుడి చేయూత

మేడారం, జూన్ 10 : ముంబాయి ఐఐటీ, గేట్ ఓవరల్ ర్యాంక్ 104 సాధించిన పేద విద్యార్థిని సంకె పల్లవికి పైచదువుల నిమిత్తం రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తనయుడు సూర్య ఆర్థిక సాయం అందించారు. సోమవారం తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామం చేరుకొని పల్లవిని సన్మానించి రూ. 70వేలు అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ తాడ్వాయి మండలం అధ్య క్షుడు బొల్లు దేవేందర్, మేడారం ఉత్సవ కమిటీ చైర్మన్ అరెం లచ్చు పటేల్, నాయకులు తాడాల శ్రీను, ఇప్ప నాగేశ్వరావు, ఎనగంటి రామయ్య, నరేశ్, సంకె శ్రావణ్, రాపోలు సంజీవరెడ్డి, కుక్కల ఉప్పలయ్య, నూనవత్ శ్రీను ఉన్నారు.


విద్యార్థిని సన్మానిస్తున్న సూర్య

# జిల్లా వాసులకు బీఎస్ఏ జాతీయ అవార్డు


బహుజన సాహిత్య అకాడమీ అవార్డు అందుకుంటున్న సతీష్, సంపత్, మల్లయ్య

కాటారం, జూన్ 10: మండలంలోని కాటారం జీపీ పరిధిలోని గారెపల్లివాసి, స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు కొట్టె సతీష్ బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ద్వారా జాతీయ సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. మహారాష్ట్ర లోని పూణేలో పశ్చిమ భారతదేశ కాన్ఫరెన్స్‌లో నిర్వాహకులు, గాయకుడు రాంబాబు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఏ ప్రతినిధులు గౌతమ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల : మండలంలోని ద్వారకపేటకు చెందిన గ్రామీణ వైద్యుడు (ఆర్ఎంపీ) కత్తి సంపత్ బహుజన సాహిత్య అకా డమీ జాతీయ అవార్డును అందుకున్నారు. మహా రాష్ట్రలోని పూణే జరిగిన కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ రాధకృష్ణ చేతుల మీదుగా పురస్కారాన్ని పొందారు.

● గణపురం: మండల పరిధి చెల్పూరులోని కేటీపీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ జెన్‌కో యూనిట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలువేరు మల్లయ్య అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు పూనేలో సోమవారం బహుజన సాహిత్య అకాడమీ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు.

## నులిపురుగులను నిర్మూలిద్దాం

**ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ**

ములుగు కలెక్టరేట్, జూన్ 10: ఈనెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని నులిపురుగులను నిర్మూలిద్దాం...పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదామని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ ప్రభావం వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయని అన్నారు. ఇందుకోసం పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు విధిగా ఇప్పించాలన్నారు. నులిపురుగుల నుంచి పిల్లలను కాపాడేందుకు లైన్ డిపార్టుమెంట్‌కు చెందిన ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య మాట్లాడుతూ నులిపురుగులలో ఎలికపాములు, నులిపురుగులు, కొంకి పురుగులు అనే మూడు రకాల క్రిములు ఉంటాయని, ఇవి పిల్లలు ఆరుబయట వట్టి కాళ్లతో ఆడుకున్నప్పుడు, చేతులు కడుక్కోకుండా ఆహారం తీసుకున్నప్పుడు, బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేయడం వల్ల, అపరిశుభ్ర పరిసరాల వల్ల సంక్రమిస్తాయని అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు తమవంతుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రణధీర్ మాట్లాడుతూ అల్బెండజోల్ 400ఎంజీ మాత్ర ఒకటి నుంచి రెండేళ్ల యవసు గల పిల్లలకు సగం అందించాలని, రెండునుంచి మూడేళ్ల వారికి పూర్తి మాత్ర అందించాలన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీకాంత్, పవన్, వైద్యాధికారులు, డెమో తిరుపతయ్య, మానిటరింగ్ సూపర్‌వైజర్ సంపత్, సీహెచ్‌వోలు సంపత్‌రావు, దుర్గారావు, భాస్కర్, డీపీఎంవో సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

**పిల్లలను బడిలో చేర్పించాలి**

తాడ్వాయి : మండలంలోని బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో జరిగిన బడిబాట ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ప్రైవేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాలైన మౌలిక వసతులు ఉన్నాయని, ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు అర్షం రాజు, జి.సాంబయ్య, మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యాయులు బాబూరావు, రవీందర్, లక్ష్మయ్య, పాపారావు, వెంకటలక్ష్మి, రేణుక, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆదివాసీల సాగు భూమికి హక్కు కల్పించాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 10: కొమరంభీంకాలనీ ఆదివాసీల సాగులో ఉన్న భూమికి హక్కు కల్పించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలను ఆయన ప్రారంభించారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని, బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, వరప్రసాద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై కళాజాతా

గోవిందరావుపేట, జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారథి కళాకారులు మండలంలోని పస్రా, ముత్తాపూర్ గ్రామాల్లో సోమవారం కళాజాతాను నిర్వహించారు. సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, సమీపంలో ఉన్న అధికారులను తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కుమార్, రాగుల శంకర్, గోల్కొండ బుచ్చన్న, ఈర్ల సాగర్, మార్త రవి, కనకం రాజేందర్, ఎమ్డీ.రహీమొద్దీన్, బోడ కిషన్, రామంచ సురేష్, ఉప్పుల విజయ్‌కుమార్, పోలెపాక తిరుపతి, గోల్కొండ నరేష్, ఉంద్రాతి భాస్కర్, దీపక్, రాము, శ్రీలత, శోభ తదితరులు పాల్గొన్నారు.

## 14న మండల సర్వసభ్య సమావేశం

కాటారం, జూన్ 10: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 14న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అడ్డూరి బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సభ్యులు, డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## బిల్లు రాలేదని పాఠశాల భవనానికి కంచె అడ్డుపెట్టిన కాంట్రాక్టర్

వెంకటాపురం(నూగూరు), జూన్ 10: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో నిర్మించిన భవనంలోకి ఎవరూ వెళ్లకుండా కాంట్రాక్టర్ భవనం రహదారికి అడ్డుగా కంచె ఏర్పాటు చేశాడు. కొత్తగా నిర్మించిన ఈ భవన పనులకు పెద్దమొత్తంలో బిల్లులు రావాల్సి ఉందని, అందుకోసమే కాంట్రాక్టర్ కంచె ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈభవనంలోనే నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాల నిర్వహణ జరగనుంది.

## అందుబాటులో వరి విత్తనాలు

వాజేడు, జూన్ 10: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ సీఈవో సోమా సత్యనారాయణ తెలిపారు. ఎంటీయూ 1224(సన్నాలు), ఎంటీయూ 1064(సన్నాలు), ఎంటీయూ 1121 (దొడ్డురకం), బీపీటీ 5204 (సన్నాలు) రకం విత్తనాలు ఉన్నాయన్నారు. అదే విధంగా రైతులకు కావాల్సిన టార్పాలీన్లు, బ్యాటరీ పంపులు, తైవాన్ పవన్ స్ప్రేయర్లు కూడా ఉన్నాయని అన్నారు.

## బీజేపీ శ్రేణుల సంబురాలు

మల్హర్, జూన్ 10 : ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం రాత్రి సంబరాలు జరిగాయి. పార్టీ మండల అధ్యక్షుడు ముడితనపెల్లి ప్రభాకర్‌తోపాటు నాయకులు టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చొప్పరి రాజు, రమేష్, నిషాన్, విజయ్‌కుమార్, బండి శ్రీనివాస్, సంజీవ్, చేరాలు, రాజయ్య, రాజయ్య, శ్రీనివాస్, కార్తీక్, ప్రశాంత్, మహేష్, సాయికిరణ్, సంజీవ్, సుదర్శన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక రోగులకు వైద్య పరీక్షలు

వాజేడు, జూన్ 10: ఇకపై మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల రెండో సోమవారం మానసిక రోగులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు అల్లెం అప్పయ్య ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని వాజేడు, పేరూరు, వెంకటాపురం(నూగూరు) మండలంలోని ఎదిర పీహెచ్‌సీల పరిధిలోని మానసిక రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టరు నర్మద తెలిపారు. మానసికంగా బాధపడుతున్న చిన్నారులు, పెద్దలకు పరీక్షలు చేయబడతాయని, ఈ మూడు కేంద్రాల పరిధిలోని వైద్యసిబ్బంది క్రమం తప్పకుండా వాజేడు పీహెచ్‌సీకి తీసుకువచ్చేందుకు సహకరించాలని ఆమె అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో పలువురికి ఆమె పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మధుకర్, మహేందర్, హెచ్ఎస్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ


మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, వెంకటరమణారెడ్డి

చిట్యాల, జూన్ 10: ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మండల కేంద్రంలో సోమవారం వేర్వేరుగా పర్యటించారు. మండల కేంద్రానికి చెందిన బుర్ర వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుమారులు బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, నరేష్‌ను పరామర్శించారు. మృతురాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. వారి వెంట జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ నాయకులు పిట్ట సురేష్‌బాబు, చింతల రమేష్, పెరుమాండ్ల రవీందర్, పిట్టల రాజమౌళి, శివాజీ, జన్నె యుగందర్, పువ్వాటి హరికృష్ణ, ఆనందం, బాలకృష్ణ, కుమారస్వామి, శ్రీకాంత్, రాజు, శ్రీదేవీ, సంతోష్ తదితరులు ఉన్నారు. అలాగే వెంకటలక్ష్మి కుటుంబాన్ని టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి పరామర్శించారు. పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, బొల్లపెల్లి రవీందర్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మల్హర్, జూన్ 10 : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) నాయకులు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన తాడిచర్లలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, 250 గజాల స్థలం, పెన్షన్, హెల్త్‌కార్డు, ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాలని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు పెన్షన్లు, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యాదళ్ల గట్టయ్య,జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని రాజయ్య, మండల అధ్యక్షుడు ముడితనపెల్లి ప్రభాకర్, నాయకులు బూడిద సతీష్, చొప్పరి రాజు, గడ్డం సమ్మక్క, బండారి యశోద, పార్వతక్క, షేక్ చాంద్ పాషా, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, జూన్ 10: సీఎంఆర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ మిల్లర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో సివిల్‌సప్లయ్ మేనేజర్ బి.రాంపతితో కలిసి జిల్లాలోని మిల్లర్ల యజమానులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చివరిగింజ వరకు కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు, ఎగుమతులు, దిగుమతులు, సీఎంఆర్ ధాన్యం విషయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.